www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 21 డిసెంబర్ 2025



ట్రాన్స్‌కో నిర్లక్ష్యం..విద్యుదాఘాతంతో రైతు మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె మండలానికి చెందిన ఓ రైతు ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యానికి దుర్మరణం పాలయ్యాడు. శనివారం జరిగిన ఈ విషాదకర సంఘటనపై కుటుంబీకుల కథనం మేరకు.. యనమలవారిపల్లికి చెందిన రైతు వై.చంద్రశేఖర్(56) ఆవులకు గడ్డి కోసుకునేందుకు ఊరికి సమీపంలో ఉన్న తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. రెండు రోజుల క్రితం ట్రాన్స్‌కో సిబ్బంది విద్యుత్ మరమ్మతులు చేసి నిర్లక్ష్యంగా విద్యుత్ తీగలను కింద పడేశారు. ఆ విద్యుత్ వైర్లకు విద్యుత్ సరఫరా రావడంతో గడ్డి కోస్తున్న రైతు చంద్రశేఖర్ ఒక్కసారిగా విద్యుదా ఘాతానికి గురై కుప్పకూలిపోయాడు. ఎంతసేపటికి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి పరిశీలించగా మృతి చెంది పడి ఉన్నాడు. వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేయించి తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ట్రాన్స్‌కో సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ఓ రైతు బలయ్యాడని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు మృతి చెందిన సంఘటనపై కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరిశుభ్రతను జీవితశైలిగా మార్చుకోవాలి

- కలెక్టర్ నిశాంత్ కుమార్

ప్రజాశక్తి- కలకడ

పరిశుభ్రతను జీవితశైలిగా మార్చుకోవాలని, ప్లాస్టిక్ నిర్మూలనే లక్ష్యంగా పునర్వినియోగించదగిన వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహిద్దామని కలెక్టర్ నిశాంత్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం కలకడలో జరిగిన స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రత అనేది ఒక్కరోజు లేదా ఒక్క నెలలో జరిగే కార్యక్రమం కాదని, అది ప్రతి ఒక్కరి జీవితంలో భాగంగా మారాలని తెలిపారు. మన రాష్ట్రాన్ని, జిల్లాను, మండలాన్ని, గ్రామ పంచాయతీని, పాఠశాలలను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా మాత్రమే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించగలమన్నారు. పరిశుభ్రత లోపిస్తే అనేక ఆరోగ్య, పర్యావరణ సమస్యలు ఎదురవుతాయన్నారు. గ్రీన్ ఆంధ్ర కార్యక్రమం ద్వారా పచ్చదనం పెంపొందించడం, ప్రతి చోట చెట్లు నాటడం ద్వారా మెరుగైన వాతావరణాన్ని సృష్టించడం జరుగుతుందని వివరించారు. ప్లాస్టిక్ నిర్మూలన పై ప్రత్యేక దృష్టి సారించి, పునర్వినియోగించదగిన వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల థీమ్‌గా డిస్పోజబుల్ వస్తువుల వినియోగం తగ్గించి, రీయూజబుల్ వస్తువుల వినియోగాన్ని పెంచడం అనే అంశాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. రాష్ట్ర సచివాలయాల్లో ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ల వినియోగాన్ని నిషేధించి, గ్లాస్ వాటర్ బాటిళ్లను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. దీని వల్ల లక్షల సంఖ్యలో ప్లాస్టిక్ బాటిళ్ల వినియోగం తగ్గిందన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద విద్యార్థిని విద్యార్థులు, జిల్లా కలెక్టర్ కు ఘనంగా స్వాగతం పలికారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆవరణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రభుత్వం కళాశాల నుంచి ఆర్‌టిసి బస్టాండ్ వరకు నిర్వహించిన ర్యాలీని కలెక్టర్ పచ్చజెండా ఊపి ప్రారంభించి, బస్టాండ్ వరకు ర్యాలీని నిర్వహించి మానవహారం చేపట్టి స్వచ్ఛ ఆంధ్ర -స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో టిడిపి అధ్యక్షుడు ప్రభాకర్ నాయుడు, సింగల్ విండో అధ్యక్షులు మద్దిపట్ల వెంకటరమణ నాయుడు, కలికిరి మార్కెటింగ్ యాడ్ డైరెక్టర్ ముబారక్‌అలీ, డిపిఒ రాధమ్మ, జిఎస్‌డబ్ల్యూ స్ శాఖ జిల్లా అధికారి లక్ష్మీపతి, తహశీల్దార్ మహేశ్వరీ బాయి, ఎంపిడిఒభాను ప్రసాద్ ఎంఇఒ మునేంద్రనాయక్, డిప్యూటీ ఎంపిడిఒ చక్రపాణి, ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు ఉద్యోగులు, సర్పంచ్, ప్రజా ప్రతినిధులు విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

'ఉపాధి'ని యథావిధిగా కొనసాగించాలి

- సిఐటియు, వ్య.కా.స నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

మహాత్మ గాంధి గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యాథావిధిగా కొనసాగించాలని సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు రామాంజులు, రామచంద్ర, సుధీర్‌కుమార్ శనివారం డిఆర్‌ఒకు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉపాధి హామీ చట్టాన్ని ఎలా నిర్వీర్యం చేయాలని ఆలోచిస్తూ ఉందని, ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయడమే పనిగా పెట్టుకుని ప్రతి బడ్జెట్‌లో నిధుల కోత పెడుతుందని, నేడు ఏకంగా మహాత్మాగాంధీ పేరుని తొలగించి జీ రామ్ జీ అని పేరు చేర్చి మతపు రంగు పులుమే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. 2005 చట్టం ప్రకారం వ్యవసాయ పనులు లేని రోజుల్లో ఏడాదిలో వంద రోజులు ఎప్పుడైనా పని పొందే హక్కు ఉందని, ప్రస్తుతం అది లేకుండా పోతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో 90 శాతం నిధులు కేంద్రం 10 శాతం నిధులు రాష్ట్రం భరించేదని ప్రస్తుత మార్పు వల్ల 60 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం 40 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం భరించేలా మార్పు చేశారని దీనివల్ల రూ.2,800 కోట్లు రాష్ట్రం మీద భారం పడుతుందని వారు తెలిపారు. 125 రోజులకు పని పెంచినట్లు కేంద్రం చెబుతున్న అందుకు తగ్గ నిధులను కేటాయించలేదని వారన్నారు. గ్రామీణ పేదలకు వలసల నివారణకు ఎంతగానో ఉపయోగపడే ఈ చట్టాన్ని బిజెపి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నిర్వీర్యం చేస్తుందని అందులో భాగంగానే పేరు మార్పుతో పాటు అనేక వ్యతిరేక మార్పులను తెచ్చిందని విమర్శించారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో మరింత ఉధృతంగా కేంద్రం మీద ఒత్తిడి తెస్తామని హెచ్చరించారు. ఒక వైపు విశాఖ ఉక్కు లాంటి పరిశ్రమలు ప్రయివేట్ పరం చేస్తూ మరో వైపు పేదల ఉపాధికి గండి కొడుతూ నిరుద్యోగ సమస్య పెరిగి ఆహార భద్రతకు ముప్పు వాటిల్లుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం పునరాలోచించి చట్టాన్ని యథాస్థితిలో కొనసాగించే వరకు వివిధ రూపాలలలో ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు మాధవయ్య, రత్నం పాల్గొన్నారు.


డిఆర్‌ఒకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పోలియో రహిత సమాజానికి కృషి : డిఎంహెచ్ఒ



ర్యాలీలో పాల్గొన్న డిఎంహెచ్ఒ, వైద్య సిబ్బంది

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

పల్స్ పోలియోను విజయ వంతం చేయడం ద్వారా పోలియోలేని భారతదేశం నిర్మాణానికి కృషి చేద్దామని డిఎంహెచ్ఒ డాక్టర్ లక్ష్మీనరసయ్య పిలుపు నిచ్చారు. పట్టణంలోని ఏరియా ఆస్పత్రి నుంచి నేతాజీ సర్కిల్ వరకు వైద్యా రోగ్య సిబ్బంది ర్యాలీని నిర్వహించారు. ర్యాలీని డిఎంహెచ్ఒతో పాటు జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారిని ఉషశ్రీ, ఏరియా ఆసుపత్రి సూప రింటెండెంట్ లక్ష్మీప్రసాద్ జండా ఊపి లారీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యా ప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం విజయవం తానికి అన్ని రకాల ఏర్పాట్లు చేశామన్నారు. 0-5సంవత్సరాల లోపు వయసు గల పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాల్సిన బాధ్యత వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది తోపాటు ప్రజలందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా ర్యాలీలోవైద్య సిబ్బంది పోలియో అంతం మన పంతం, నిండు జీవితానికి రెండు చుక్కలు, పల్స్ పోలియోను విజయవంతం చేద్దాం అం టూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.జాతీయ రహదారిపై నేతాజీ సర్కిల్లో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డిపిహెచ్‌ఎన్ఒ శోభలత సిహెచ్ నారాయణ డిప్యూటిహెచ్ఇఒలు బలరామరాజు, మహ మ్మద్ రఫీ, పర్యవక్షకులు బాషా, నూర్జ హాన్, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు ప్రజలు పాల్గొన్నారు. **కొత్తకోట** :0-5 ఏళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని ఎంఇఒ రెడ్డిశేఖర్ పేర్కొన్నారు. మండలంలో 54 కేంద్రాల్లో అంగన్వాడీ సెంటర్లు, సచివాలయాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, బస్టాండులు, పాఠశాలలో ఆదివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పల్స్ పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **తంబళ్లపల్లి** : రెండు పోలియో చుక్కలను పిల్లలకు వేయించడం ద్వారా వైకల్యాన్ని జయించవచ్చని డ్వామా పీడీ వెంకట రత్నం అన్నారు. నియోజకవర్గ ప్రత్యేకధికారి అమరనాథ రెడ్డి, వైద్యఆరోగ్య సిబ్బందితో కలసి పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఆదివారం పల్స్ పోలియో ద్వారా అప్పుడే పుట్టిన పిల్లల నుంచి 5 ఏళ్ల వరకూ పిల్లలకు పోలియో చుక్కలు వేస్తారన్నారు.

ఆక్రమణలు తొలగించాలి : సిపిఎం


మాట్లాడుతున్న శ్రీనివాసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలో రోడ్డు ఆక్రమణలు తొలగించి ట్రాఫిక్ సమస్య పరిష్కారం చేయాలని సిపిఎం అన్నమయ్య జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం పార్టీ కార్యాలయ ఆవరణలో సిపిఎం నాయకులు ప్రభాకర్‌రెడ్డి, హరిశర్మ, ఐటియుసి నాయకులు కృష్ణమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాగరాజులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే విపరీతమైన వాహనాల రద్దీ, ప్రజల రాకపోకలతో తీవ్రమైన ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి ప్రజలు అవస్థలు పడుతున్నా మదనపల్లె జిల్లా కేంద్రంగా ఏర్పడ బోతోందని వివరించారు. 1960లో మదనపల్లి మున్సిపాలిటీగా ఏర్పడినప్పుడు ఏర్పాటు చేసిన రోడ్లే ఈ రోజుకి ఉన్నాయని, పట్టణంలోని రోడ్లు పూర్తిగా ఆక్రమణకు గురైన ఫలితంగా ట్రాఫిక్ ఆటంకాలు తీవ్రంగా ఉన్నాయన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు లేక, బెంగళూరు వైపు వెళ్లే పెద్ద పెద్ద వాహనాలన్నీ పట్టణంలోకి వస్తున్న ఫలితంగా మరింత ఇబ్బందికర పరిస్థితి ఏర్పడిందన్నారు. జిల్లా కేంద్రమైన తర్వాత ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఏర్పడడం, ఆ ప్రభుత్వ కార్యాలయాలకు ప్రజల రాకపోకలు సాగించడం జరుగుతుందని దీనివల్ల మరింత ట్రాఫిక్ పెరిగే అవకాశం ఉందన్నారు. పట్టణంలో ఉన్న రోడ్లన్నీ ఆక్రమణలు పాల్పడ్డారని, రోడ్డు ఆక్రమించుకోవడమే కాకుండా, వాళ్ళ బిల్డింగ్‌ల ముందు చిన్న తోపుడు బండ్లు, బంకులు పెట్టించి, వారి వద్ద వేల రూపాయలు బాడుగలు వసూలు చేసుకొని దోపిడీకి పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సబ్ కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకొని ట్రాఫిక్ అడ్వైజరీ కమిటీ సమావేశాన్ని జరిపి, ఈ ట్రాఫిక్ కంట్రోల్ చేయడానికి ప్రయత్నం చేయాలని, దానికి వెనువెంటనే ఈ రోడ్ల ఆక్రమణలను తొలగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో సిటిఎం రోడ్డులో ఫ్లైఓవర్ పనులు ప్రారంభించాలని, కదిరి రోడ్డులో నుంచి బెంగళూరు రోడ్డుకి, బెంగళూరు రోడ్డు నుంచి పుంగనూరు రోడ్డుకి లింకయ్యే విధంగా బైపాస్ రోడ్డును ఏర్పాటు చేయాలని కోరారు. పట్టణంలో ఉన్న వారపుసంతను టమోట మార్కెట్ యార్డుకు, మార్కెట్ యార్డును పట్టణ బయటకు తరలించాలని కోరారు. ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ అభివృద్ధి చెయ్యాలని, ఫుట్ పాత్ ఏర్పాటు చేయాలని, పట్టణంలోని ప్రజలు, వాహనదారులు అందరికీ ట్రాఫిక్ అవగాహన కల్పించాలని కోరారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రజలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలతో ఐక్య కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.



మాట్లాడుతున్న రిసోర్స్ పర్సన్ జయసుబ్బారెడ్డి

ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

-ఇంటర్మీడియట్ బోర్డు రిసోర్స్ పర్సన్ జయసుబ్బారెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

ప్రభుత్వం ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో విప్లవాత్మక మార్పులు తీసు కువచ్చిన నేపథ్యంలో ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో ఉత్తమ ఫలితాల సాధనకు అధ్యాపకులు కృషి చేసి, ఉత్తమ ఫలితాలు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఇంటర్మీడియట్ బోర్డు రిసోర్స్ పర్సన్ జయసుబ్బారెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఓ ప్రయివేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్య జిల్లా అధికారి రవి ఆధ్వర్యంలో జిల్లాలోని కళాశాల అధ్యాపకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జయసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఇంటర్మీడియట్ సిలబస్‌లో వచ్చిన మార్పులకు అనుగుణంగా పబ్లిక్ పరీక్షల నిర్వహణ చేపట్టాలన్నారు. ముఖ్యంగా పరీక్షల్లో వచ్చిన మార్పులు,టైం టేబుల్ లో వచ్చిన మార్పులు, లాంగ్వేజ్ లలో మార్పులు, 24 పేజీల బుక్ లెట్‌లు, మాథ్స్,ఫిజిక్స్, కెమిస్ట్రీ, అర్ధశాస్త్రం, సివిక్స్ సబ్జెక్టులకు 32 పేజీల బుక్ లెట్స్ వాడాలని,టైం టేబుల్స్ లో కూడా సబ్జెక్టుల కాంబినేషన్‌లు మారడం గమనించాలని పేర్కొన్నారు. ప్రశ్నాపత్రాలు భద్రపరిచేందుకు 12 బాక్సులకు బదులుగా 23 ట్రంకు పెట్టెలను వినియోగించాలని సూచించారు. సెకండ్ ఇయర్ విద్యార్థులకు మాత్రం పాత పద్ధతిలోని 24 పేజీల బుక్ లెట్స్ వాడడంతో పాటు అన్నింటినీ పిపిటి ల ద్వారానే తెలియజేయాలన్నారు. అనంతరం ఇంటర్మీడియట్ విద్య జిల్లా అధికారి రవి మాట్లాడుతూ మొదటి సంవత్సరం పరీక్షలో బోటనీ, జువాలజీ అనే రెండు పేపర్లకు బదులుగా బయాలజీ అని ఒకే పేపరు చేయడం జరిగిందన్నారు. దీనికి మాత్రం 24 పేజీల బుక్ లెట్స్ వాడాలన్నారు. ఇంటర్మీడియట్ విద్యలో విప్లవాత్మక మార్పులతో విద్యార్థుల్లో ఆలోచన విధానం, ప్రయోగాత్మక నైపుణ్యాలు పెరుగుతాయన్నారు. ప్రతి ఒక్కరూ ఈ మార్పులను గమనించి రాబోవు పబ్లిక్ పరీక్షల్లో ఇంటర్ లో ఉత్తమ ఫలితాలు సాధనకు అధ్యాపకులు సమిష్టిగా పనిచేయాలని సూచించారు.

15వ రోజుకు చేరిన రిలే దీక్షలు

ప్రజాశక్తి-రాజంపేట

రాజంపేట కేంద్రంగా అన్నమయ్య జిల్లా సాధన కోసం మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి ఆధ్వర్యంలో ఆర్అండ్‌బి అతిథి గృహం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారానికి 15వ రోజుకు చేరుకున్నాయి. శనివారం పట్టణ పరిధిలోని సాయి నగర్ కు చెందిన భాస్కర్ రాజు, దయానంద్, ఎల్లమ రాజు, సుబ్బరాజు, సుదర్శన్ రెడ్డి, నరసారెడ్డి, సుబ్బరామిరెడ్డి, వెంకటరామిరెడ్డి, బాలసుబ్రమణ్యం తదితరులు నిరాహార దీక్షలో పాల్గొని రాజంపేట జిల్లా కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.



రిలే దీక్షలో సాయి నగర్ వాసులు

నిమ్మ ధర పతనం

- గతేడాది కిలో రూ.100.. ప్రస్తుతం రూ.10
- నిమ్మకాయలను పొలంలోనే వదిలేస్తున్న వైనం
- ఎకరాకు రూ.50 వేలకు పైగా నష్టం
- ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

నిమ్మకాయల ధర పాతాళానికి పడిపోయింది. మార్కెట్లో కేజీ నిమ్మకాయల ధర రూ. 10 మాత్రమే రైతులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొం టున్నారు. కోత కూలీల ఖరులు, రవాణా ఖర్చులు కూడా రాక పోవడంతో రైతులు నిమ్మకాయలను కోత కోయకుండానే తోటల్లో చెట్లపై వదిలేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా రైతులు 1960 ఎకరాలలో నిమ్మ తోటలను రైతులు సాగు చేస్తున్నారు. పులివెందుల నియోజకవర్గంలో 480 ఎకరాలలో సాగులో ఉంది. మార్కెట్లో నిమ్మకాయం ధర ఒక్క సారిగా పాతాళానికి పడి పోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 10 రోజుల్లోనే కేవలం కిలో 10 రూపాయలకు పడి పోయింది. పెట్టుబడులు కూడా చాకపోవడంతో చేసేదేమి లేక రైతులు నిమ్మకాయలు కోయకుండానే తోటల్లోనే వదిలివేస్తున్నారు. మరికొంత ముంది రైతులు కోత కోసి తక్కువ రెయితే విక్రయిస్తున్నారు. గత ఏడాది ఇదే సీజన్లో కిలో రూ.100 నుంచి రూ.120 వరకు ధర పలికింది. రైతులు లాభాలు గడించారు. ఈ ఏడాది నిమ్మసాగు రైతులు ధర పడిపోవడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. ఎకరానికి పెట్టుబడి రూ.50 వేలు కాగా, కోత కూలీల ఖర్చు మరో రూ.30 వేలు అవుతుంది. దిగుబడి ఉన్నా ధర లేకపోవడంతో ఎకరం పొలం లోనే నిమ్మకాయలు అమ్మకాలు చేస్తే రూ.30 వేల నుంచి రూ.10 వేలు మాత్రమే వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. ఈ లెక్కన ఎకరాకు సరాసరి రూ.60 వేలు వరకు నష్టం వస్తోందని నిమ్మ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది నిమ్మకాయల పంట బాగా దిగుబడి రావటం, మార్కెట్లో ధర ఉండటంతో వచ్చిన దిగుబడిని రైతులే మదనపల్లె, తాడిపత్రి మార్కెట్లకు తరలించి అమ్మకాలు సాగించారు. ఈ ఏడాదిలో గత నెల రోజుల నుంచి ముమ్మరంగా నిమ్మకాయల కోతలు వచ్చాయి. కోతలు వచ్చిన దగ్గర నుండి రైతుకు ఆశించిన ధర దక్కడం లేదు. ఒక వైపు తోటలో వచ్చిన తెగుళ్లను కాపాడుకోవడానికి ఎక్కువగా మందుల పిచికారీ చేశారు. దీంతో పంటకు ఎక్కువగానే ఖర్చయింది. తీరా దిగుబడి వచ్చేసరికి మార్కెట్లో ధర లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం తాడిపత్రి, మదనపల్లె మార్కెట్‌కు తీసుకు వెళ్ళాలంటే కనీసం కోత, కూలీ ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదు. సాగు చేసిన రైతులు కుటుంబ సభ్యులతో కలిసి కాయలు కోసి సమీపంలోని వేంపల్లి, ప్రొద్దుటూరు, మైదుకూరు, ఆళ్లగడ్డ ప్రాంతాలకు తీసుకెళ్ళి విక్రయిస్తున్నారు. కనీసం నిమ్మకాయలు తీసుకువెళ్లిన ఆటోల బాడుగ కూడా వచ్చే పరిస్థితి లేదని, ఈ ఏడాదికి ఎకరాకు రూ.50 వేల నుండి రూ.60 వేల వరకు నష్టం వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


సాగులో ఉన్న నిమ్మ తోట



నిమ్మకాయలను కొనేవారే లేరు

మూడేళ్లుగా ఐదు ఎకరాల్లో నిమ్మసాగు చేస్తున్నా. ఈ ఏడాది కిలో రూ.8 నుంచి రూ.10 మాత్రమే ధర ఉంది. కనీసం కోత, కూలీల ఖర్చులు కూడా వచ్చే పరిస్థితులు లేవు. ఎకరానికి సాగు, మందుల ఖర్చులు కలిపి రూ.50 వేలు, చివరగా కోత కూలీల ఖర్చు మరో రూ.60 వేలు అయ్యింది. మార్కెట్‌లో ధరలేక నిమ్మకాయలను తోటలోనే వదిలి వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

- తమ్మిశెట్టి హరినాథ్, రైతు సింహాద్రిపురం మండలం.

గిడ్డంగులు ఏర్పాటు చేయాలి

నాలుగు ఎకరాలలో నిమ్మ సాగును చేశాను. ధరలు నిలకడగా లేకపోవడంతో దిగుబడి వచ్చినా మంచి లాభాలు పొందలేకపోతున్నాం. గిడ్డంగులను ఏర్పాటు చేస్తే నిమ్మ సాగు చేయడానికి రైతులు ముందుకు వస్తారు. అకాల వర్షాల వల్ల ఈ ఏడాది దిగుబడి పూర్తిగా తగ్గింది. ప్రభుత్వం నిమ్మ రైతులను క్రాప్ ఆధారంగా కాకుండా బీమా సౌకర్యం కల్పిస్తే రైతులకు మేలు జరుగుతుంది.

- వెన్నపూస రాజకుమారెడ్డి, రైతు, లింగాల మండలం.

పేదల సంక్షేమమే సిఎం ధ్యేయం : టిడిపి

ప్రజాశక్తి-రాయచోటి : పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమని టిడిపి నాయకులు విశ్వనాథ నాయక్ పేర్కొన్నారు. శనివారం టిడిపి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రయివేట్, ప్రభుత్వ భాగస్వామ్యంతో పిపిపి మెడికల్ కాలేజీలను నిర్మించి పేద విద్యార్థులకు వైద్య విద్యలో అవకాశాలు పెంచే దిశలో అడుగులు వేస్తుంటే దానిని జీర్ణించుకోలేని వైసిపి అసత్య ప్రచారాలు చేస్తోందన్నారు. ఢిల్లీలో పిపిపికి ఆమోదం ఇస్తూ గల్లీలో కోటి సంతకాల పేరుతోటి వీధి నాటకాలు ఆడుతోందని రాయచోటి నియోజకవర్గంలోని సంతకాల సేకరణ చిత్తశుద్ధి ఉంటే బహిరంగపరచాలని డిమాండ్ చేశారు. పిపిపి విధానం ద్వారా ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఇడబ్ల్యూఎస్ విద్యార్థులకు రిజర్వేషన్ యథా విధంగా కొనసాగుతాయన్నారు. పిపిపి విధానంతో మెరుగైన ఉచిత వైద్యం అందుబాటులోకి వస్తుందన్నారు. రెండేళ్లలోనే కాలేజీ నిర్మాణాలు పూర్తయి 1750 సీట్లు మన విద్యార్థులు పొందుతారని తెలిపారు. పిపిపి విధానం గురించి వైసిపి రాజకీయ స్వార్థంతో తప్పుడు ప్రచారంతో ప్రజల్లో లేనిపోని అపోహలని భయాలను కలిగిస్తోందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు జయరాంరెడ్డి, నాగార్జునరెడ్డి, బసిరెడ్డి, శ్రీనివాసులు నాయుడు, సిద్ధారెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టిడిపి నాయకులు

మమ్మల్ని బతకనివ్వండి : బాస్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బుద్ధుడి విగ్రహం తల నరికినందుకు నిరసన తెలిపితే తప్పుడు కేసులు పెట్టారని, బాస్ ఆవిర్భావ దినోత్సవానికి ఆటకం కలిగించారని భారతీయ అంబేద్కర్ సేన అధ్యక్షులు పిటిఎం శివప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీసుల వేధింపులకు గురిచేస్తున్నారని మమ్మల్ని బతకనివ్వండి, లేకుంటే ఒకేసారి చంపేయండని కన్నీటి పర్యంతమయ్యారు. బాస్ 14వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల నిర్వహణకు పోలీసు అనుమతి కోరినా తాత్సారం చేసి, తీరా షరతులతో కూడిన అనుమతి ఇచ్చారని పేర్కొన్నారు. ఆ ప్రకారమే వేడుకలు జరుపుకునేందుకు సమాయాత్తం అయితే అధిక సంఖ్యలో పోలీసులు మొహరించి, డ్రోన్ కెమరాలతో భయభ్రాంతులకు గురి చేయడంతో బాస్ జెండాల ఆవిష్కరణ ఆగిపోయిందని చెప్పారు. 2019 వైసిపి పాలనలో దళితులపై వేధింపులు, హత్యలు, అత్యాచారాలు పెరగడంతో 2024 ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల్నే గెలిపించారని గుర్తు చేశారు. అన్ రిజర్వుడు నియోజకవర్గాల్లో కూడా కూటమి అభ్యర్థుల గెలుపునకు కారణమైన ఎస్‌సి, ఎస్‌టిలపై ఏడాది కాలంగా అనేక దారుణాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. వీటిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఎస్‌సి, ఎస్‌టిల అగ్రహానికి కూటమి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు కార్యక్రమంలో బాస్ నాయకులు ముత్యాల మోహన్, నీరుగట్టి రమణ, సొన్నికంటి రెడ్డెప్ప, జి.వి.రమణ, గంగాధర్, శశిధర్, రెడ్డిప్రసాద్, కృష్ణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నిరసన సెగ

ప్రజా'దృష్టి'

జిల్లాలో నూతన ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పిపిపి పేరిట తమ వందిమాగదుల పరం చేయడం, ఇళ్లు లేనివారికి ఇళ్లను కేటాయించాలని కోరుతూ వామపక్షాలు నిరసన సెగ అందరి దృష్టిని ఆకర్షించింది. రాష్ట్రంలోని నూతన ప్రభుత్వ వైద్య కళాశాలలను పిపిపి పరం చేయడాన్ని నిరసిస్తూ వైసిపి చేపట్టిన కోటి సంతకాల సేకరణకు అనూహ్య స్పందన లభించింది. కడప, అన్నమయ్య జిల్లాలోని పులివెందుల, మదనపల్లి మెడికల్ కళాశాలలు సైతం పిపిపి బారిన పడుతున్న సంగతి తెలిసిందే. కూటమి సర్కారు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మెడికల్ కళాశాలలపై కన్నువేసిన సంగతి తెలిసిందే. నిధులు లేవనే పేరిట నూతన మెడికల్ కళాశాలలను కైవసం చేసుకోవడంపై దృష్టి సారించడంపై విస్తృతంగా చర్చ నడుస్తోంది. వైసిపి చేపట్టిన సంతకాల సేకరణ, మెడికల్ కళా శాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా స్పందిస్తున్న ప్రశ్నలను కౌంటర్ చేయడానికి పార్లమెంట్‌లో చేసిన పిపిపి విధానం నివేదికలను ఉటంకించడం విడ్డూరాన్ని తలపిస్తోంది. రాష్ట్రంలోని కూటమి సర్కారు విద్య, వైద్య రంగాల్లో పిపిపి విధానాన్ని మినహాయించాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ నెల 18, 19వ తేదీల్లో నిర్వహించిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో కడప జిల్లాలో ఏర్పాటు చేసిన స్మార్ట్ కిచెన్ వ్యవస్థ అందరి దృష్టినీ ఆకర్షించింది. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వినియోగించడం వరకు బాగానే ఉంది. జిల్లాలోని 36 మండల కేంద్రాలలోని స్మార్ట్ కిచెన్ వ్యవస్థ నుంచి మండల కేంద్రంలోని అన్ని పాఠశాలలకు నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని తరలించడం వరకు బాగానే ఉంది. పాఠశాలలపై ఆధారపడి మనుగడ సాగిస్తున్న స్థానిక వంటసిబ్బంది పరిస్థితేమిటనే ప్రశ్నకు సమా ధానాన్ని వెతకాల్సిన అవసరం ఏర్పడింది. మండల కేంద్రాల్లోని స్మార్ట్‌కిచెన్ కేంద్రం నుంచి సుమారు ఏడు కి.మీ నుంచి 10 కి.మీ పరిధిలోని మారుమూల ప్రాంతాల్లోని పాఠశాలలకు వేడి ఆహారాన్ని సకాలంలో తరలించడం ఎంతవరకు సాధ్యమనే అంశాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉంది. కొన్ని ఇబ్బందులను, పరిమితులను సైతం అధిగమించాల్సిన అవసరం ఎంతైనా ఉందనే సంగతిని గ్రహించాలి. జిజిహెచ్‌లోని పారిశుధ్య సిబ్బందిని తొలగించడంపై సిఐటియు ఉద్యమిస్తోంది. ఈమేరకు ప్రతి సోమవారమూ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాలు అందజేస్తూనే ఉంది. జిల్లా అధికార యంత్రాంగం, కాంట్రాక్టర్‌గా మానవతా దృక్పథంతో స్పందించకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. జిఒల పేరుతో 15 ఏళ్లుగా పారిశు ధ్య విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని ఉన్నఫళంగా తొలగించడం ఎంతవరకు సబబో ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి



శిరీషకు కేక్ తినిపిస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

పోలీసు ఉద్యోగం సాధించిన శిరీషకు సన్మానం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిన కొమ్ము శిరీషను మండలంలోని ఎంఆర్‌పిఎస్ నాయకులు దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి, కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నట్లు ఎంఆర్‌పిఎస్ మండల ప్రధాన కార్యదర్శి మల్లేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ కానిస్టేబుల్ ఫలితాలను విడుదల చేయగా నిమ్మనపల్లి పంచాయతీలోని పెద్దమాదిగపల్లెకు చెందిన కొమ్ము శ్రీనివాసులు, కొమ్ము సుజాతల కుమార్తె కొమ్ము శిరీష పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిందన్నారు. ఆమెరకు విజయవాడలో ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, రాష్ట్ర హోంశాఖమంత్రి వంగలపూడి అనిత చేతుల మీద నుంచి నియామక పత్రాన్ని కొమ్ము శిరీష అందుకోవడం గర్వించదగ్గ విషయమన్నారు. గతంలో ఎస్‌సి సామాజిక వర్గంలో మాదిగలు ప్రభుత్వ ఉద్యోగాలను సాధించాలంటే అది వారికి కలగానే మిగిలిపోతూ ఉండేదన్నారు. మాదిగలకు సామాజిక న్యాయం చేయాలని రాష్ట్ర ఎమ్మార్పీఎస్ నాయకులు మందకృష్ణ మాదిగ చేసిన 30 ఏళ్ల పోరాటాన్ని గుర్తించిన సిఎం చంద్రబాబు మాదిగలకు చట్టబద్ధంగా ఎస్‌సి వర్గీకరణను అమలు చేయడం జరిగిందన్నారు. ఎస్సీ వర్గీకరణ అనంతరం ప్రభుత్వం మెగా డిఎస్‌సి, పోలీస్ నియామకాలను చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు రెడ్డి ప్రసాద్, రాజశేఖర్, హరిబాబు, గణేష్, శేషాద్రి, నారాయణ పాల్గొన్నారు.

ఐసిసి ఎస్‌సి, ఎస్‌టి రాష్ట్ర అధ్యక్షులుగా బాలాజీ

ప్రజాశక్తి-కలికిరి



ఐసిసి ఎస్‌సి ఎస్‌టి డబ్ల్యుఇ రాష్ట్ర అధ్యక్షులుగా మండలానికి చెందిన ఇడగొట్టు బాలాజీ ఎంపి కయ్యారు. గతంలో ఈయన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా తన సేవలు అందించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించినందుకు సంస్థ చీఫ్ పాట్రన్ కరుణాకరం వెంకటనాథకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రం లోని మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యంగా కృషి చేస్తానని పేర్కొన్నారు.మహిళా పారిశ్రామికవేత్తలకు 586రకాల సబ్సిడీ లోన్లు అందు బాటులో ఉన్నాయని మహిళా పారిశ్రామికవేత్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



నిర్మాణంలో ఉన్న గేటు ఆర్చి

ఉర్దూ పాఠశాలకు దాతల సహకారం

ప్రజాశక్తి-గాలివీడు

గ్రామంలోని పెద్దూరు కస్పాలోని ఉర్దూ జడ్‌పి హైస్కూల్‌కు ఉపాధ్యాయులు, దాతల సహకారంతో అభివృద్ధి దిశగా ముందుకు తీసుకు పోతున్నామని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్.జాబీర్ పేర్కొన్నారు. ప్రస్తుతం బాల, బాలికలకు హ్యాండ్ వాష్ సపరేట్ చేశామన్నారు. దెబ్బతిన్న ప్రహరీ కూడా మరమ్మతులు చేయించి నిర్మిస్తున్నామన్నారు. గేటు ఆర్చిని కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. 19 అడుగుల వెడల్పు 17 అడుగుల ఎత్తుతో నిర్మిస్తున్నామని ముందువైపున ప్రహరీ చుట్టూ జాతీయ నాయకుల చిత్రప టాల తో అలంకరింప చేస్తామని చెప్పారు. రాబోయే రోజుల్లో ఉర్దూ స్కూల్ ఉన్నత పాఠశాలను ఆదర్శ ఉన్నత పాఠశాలగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.

మీడియా బాక్స్ స్కోరర్‌గా రామకృష్ణ

ప్రజాశక్తి-వాల్మీకిపురం



విశాఖపట్నంలో ఈ నెల 21 నుంచి 23 వరకు జరగనున్న ఇండియా వర్సెస్ శ్రీలంక విమెన్ మ్యాచ్‌లకు మీడియా బాక్స్ స్కోరర్‌గా వాల్మీకిపురం పట్టణం తోటవీధికి చెందిన బొక్కసం రామక్రిష్ణ ఎంపికైనట్లు క్రికెట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా విని సికి చెందిన ఎసిఎ ప్యానెల్ స్కోరర్ బొక్కసం రామక్రిష్ణ ఎంపికకు సహకరించిన ఎసిఎ జాయింట్ సెక్రటరీ విజయ్‌కుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస మూర్తి, సతీష్ యాదవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. రామక్రిష్ణ ఎంపికపట్ల స్థానిక జివిఎస్‌సిఎస్ సభ్యులు, సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

బాల శాస్త్రవేత్తల అన్వేషణల వేదిక సైన్స్ ఫెయిర్

- పాఠశాల విద్య ఆర్‌జెడి శామ్యూల్

ప్రజాశక్తి-రాయచోటి



మాట్లాడుతున్న ఆర్‌జెడి శామ్యుల్

ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న బాల శాస్త్రవేత్తల అన్వేషణలను ప్రోత్సహించడానికి జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ ఒక అద్భుత వేదికని పాఠశాల విద్య ఆర్‌జెడి శామ్యూల్ అన్నారు. పట్టణం డైట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులలో దాగివున్న అన్వేషణాత్మక ఆలోచనలకు సైన్స్ ఫెయిర్లు పదును పెడుతున్నవన్నారు. పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా జీవిత సమస్యలకు శాస్త్రీయ పరిష్కారాలు వెతకడానికి ఇవి దోహద పడతాయన్నారు. జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల నుంచి 330 ప్రాజెక్టులు జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శించారన్నారు. వీటినుండి రెండు టీచరు విభాగం నుండి రెండు వ్యక్తిగత విభాగాల నుంచి ఏడు గ్రూపు విభాగం నుండి మొత్తం 11 ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేసామన్నారు. జిల్లా విజేతలు ఈనెల 23,24వ తేదీలలో విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ లో పాల్గొనా లన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ అనురాధ, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ కొండూరు శ్రీనివాసరాజు, ఎఇఒ అసదుల్లా, సెక్టోరియల్ అధికారులు జనార్ధన్, డైట్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ శివ భాస్కర్, సంఘ నాయకులు రామచంద్ర, వీరాంజనేయులు, శివారెడ్డి, నరసింహులు, జ్యూరీ సభ్యులు, గైడ్ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేరు మార్పు

నేను బుక్యా నాగరాణి,తండ్రి పేరు బుక్యా L చిన్నరెడ్డెప్ప నాయక్, వయసు 33 సంవత్సరాలు, ఆధార్ నెంబర్. 27241072 8163, డోరు నెంబర్.17-91-H, నెమలి నగర్ ,మదనపల్లి టౌన్ & మండలం, అన్నమయ్య జిల్లా, నా పేరును ఐశ్వర్య రాఘ జరుపుల నుండి బుక్యా నాగరాణిగా మార్చుకున్నాను. ఇకపై ఇదే అన్ని రికార్డుల్లో సవరించవలసిందిగా కోరుచున్నాను.

సకాలంలో స్వామిత్వ సర్వే పూర్తి చేయాలి



వాల్మీకిపురం :శిక్షణకు హాజరైన ఎంపిడిఒ, సిబ్బంది

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

పన్నులు వసూలు చేసి పంచాయతీకి ఆదాయాన్ని సృష్టించాలని ఎంపిడిఒ ఫక్రుద్దీన్ సాహెబ్ అన్నారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎఒ రమేష్‌బాబు, డిప్యూటీ ఎంపిడిఒ బాలరాజు, గ్రామ వార్డు సచివాలయాల డిప్యూటీ ఎంపిడిఒ లక్ష్మీపతి లతో కలిసి పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు, విఆర్ఒ, సర్వేయర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణలను రూపొందించిందని అన్నారు. అందులో భాగంగా (ఓఎస్ఆర్) కార్యక్రమం ద్వారా పంచాయతీలో స్థానికంగా అందుబాటులో ఉన్న ప్రాథమిక వనరులను ఉపయోగించుకొని పంచాయతీని అభివృద్ధి చేయాలన్నారు. పన్ను వనరులను, పన్ను రహిత వనరులను పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలన్నారు.కార్యక్రమంలో పిడిఒలు, విఆర్ఒలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సర్వేయర్లు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. **వీరబల్లి:** మండలంలోని స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో మండల పంచాయతీ కార్యదర్శులు, రెవిన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్లు లకు ఎంపిడిఒ గౌస్ బాషా, డిప్యూటీ ఎంపిడిఒ జ్యోతిశ్వర రాజు ప్రభుత్వం అమలు చేస్తున్న గ్రామ ఆబాది ప్రాంతాల సర్వే పథకం గురించి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రోన్ సర్వే, జియో మ్యాపింగ్ ద్వారా గ్రామంలో ఇళ్లున్న ప్రాంతాల్ని కొలిచి, ప్రతి ఇంటిస్థలానికి స్పష్టమైన బౌండరీలతో మ్యాప్ తయారు చేస్తారని చెప్పారు. .**కలికిరి :** సొంత ఆదాయ వనరులు, స్వామిత్వ సర్వే పై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక ఎంపిడిఒ సమావేశ మందిరంలో ఎంపిడిఒ భానుమూర్తిరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామిత్వ, స్వర్ణ పంచా యతీల పై సెక్రటరీలు, విఆర్ఒలు, డిజిటల్ సహాయకులు, ఇంజనీర్ సహాయకులు, సర్వేయర్లుకు అవగాహన కల్పించారు. ఈ సందర్భముగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీ అధికారి తమ బయోడేటాతో పాటు అకౌంట్, పాన్, ఆధార్, మొబైల్ నంబర్లను నమోదు పత్రంలో తప్పక వివరాలను పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమములో గ్రామ సచివాలయ డిప్యూటీ ఎంపిడిఒ వినయ్‌కుమార్, స్వచ్ఛ భారత్ మిషన్ మండల రిసోర్స్ కో-ఆర్డినేటర్ శంకర్, రిసోర్స్ పర్సన్ నవాజుల్ల, సర్దార్, అన్ని గ్రామ పంచాయతీ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. **కలకడ:** మండల కేంద్రమైన కలకడ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ భానుప్రసాద్ అధ్యక్షతన ఒఎస్ ఆర్‌పై పంచాయతీకి స్వంత వనరులు సేకరించడం మీద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎఒ జగదీశ్వర్ డిప్యూటీ ఎంపిడిఒలు శ్రీనివాసులు, చక్రపాణి, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ల, సర్వేయర్లు, విఆర్ఒలు పాల్గొన్నారు.

తంబళ్లపల్లి: తంబళ్లపల్లె ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం స్వామిత్వ సర్వే, అవుట్ సోర్సింగ్, రెవిన్యూపై సచి వాలయ సిబ్బంది, విఆర్ఒ, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ ఎంపిడిఒ ప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వినోద్ ఆధ్వర్యంలో ట్రైనర్లు రెడ్డిశేఖర్, నాగేశ్వర శిక్షణ ఇచ్చారు. స్వామిత్వ సర్వే తప్పులు లేకుండా పక్కాగా చేపట్టాలన్నారు. గ్రామాల్లో ఉన్న ఆర్థిక వనరులను వినియోగించుకుని పంచాయతీలకు ఆదాయం సమకూర్చాలన్నారు. **నందలూరు :** గ్రామపంచాయతీ సొంత ఆదాయ వనరులు పెంచుకోని దిశగా చర్యలు చేపట్టాలని ఎంపిడిఒ కెఆర్ ఎం ప్రసాద్ పేర్కొన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయ సభా భవనంలో శనివారం గ్రామపంచాయతీ సొంత ఆదాయ వనరులు పెంచుకునే అంశంపై అందరూ సచివాలయ సిబ్బందికి ఒక్కరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ జి. మలయాద్రి , డిప్యూటీ ఎంపిడిఒ ఎం. పద్మజ, పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **పీలేరు:** స్వామిత్వ కార్యక్రమం క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలయ్యేలా చూడాలని ఎంపిడిఒ శివశంకర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వామిత్వ కార్యక్రమంపై శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిధిలోని గ్రామ పంచాయతీల కార్యదర్శులు, రెవిన్యూ అధికారులు, సర్వేయర్లు, ఇంజి నీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లకు అవగాహనలో భాగంగా ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో ఎంపిడిఒ శివశంకర్, డిప్యూటీ ఎంపిడిఒ యుగంధర్, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** మండలంలోని ప్రతి ఇంటికి వెళ్లి స్వామిత్వ సర్వే పక్కడ్బందీగా నిర్వహించాలని మదనపల్లె డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్ అమరనాథ రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ తాజ్ మన్సూర్ అధ్యక్షతన పంచాయతీ, రెవిన్యూ సిబ్బందికి స్వామిత్వ సర్వేపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన డిడిఒ మాట్లాడుతూ సిబ్బంది బృందాలుగా ఏర్పడి గ్రామాలలో ప్రతి ఇంటికి వెళ్లి స్వామిత్వ సర్వే ఉపయోగాలను ప్రజలకు వివరించాలన్నారు. వారి ఆస్తుల వివరాలను మ్యాపింగ్ చేయాలని సూచించారు. **వాల్మీకిపురం:** ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వామిత్వ సర్వేని సకాలంలో పూర్తి చేయాలని ఎంపిడిఒ మనోహర రాజు అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, విఆర్ఒలు, సర్వేయర్లకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈఈ నెల 31వ తేదిలోపు స్వామిత్వ సర్వేని సమగ్రంగా చేపట్టి, సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ అధికారి మురళీకృష్ణ, డిప్యూటీ ఎంపిడిఒ సుధాకర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, విఆర్ఒలు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.



వీరబల్లి : మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపిడిఒ జ్యోతిశ్వరరాజు

మామిడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న యోహాన్

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

మామిడిలో పూత,పింద దశలలో రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని శాస్త్రవేత్త డాక్టర్ వై.యోహాన్ అన్నారు. మండలంలోని సెట్టిగుంట గ్రామం నందు ఉద్యాన శాఖ,ఉద్యాన పరిశోధన స్థానం, అనంతరాజుపేట అఖిలభారత సమన్వయ ఫల పరిశోధన పథకం వారు సంయుక్తంగా మామిడిలో పూత దశలో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ ఈ సందర్భంగా యోహాన్ మాట్లాడుతూ మామిడిలో పూత ప్రారంభ దశలో 13-0-45 5 గ్రాములు యూరియా 10 గ్రాములు లీటరు నీటి కలిపి పై పాటుగా పిచికారి చేయడం వలన పూత త్వరగా రావడానికి దోహదపడుతుందని సూచించారు. సూక్ష్మ పోషక మిశ్రమం లేదా అర్క మ్యాంగో స్పెషల్ 5 గ్రాములు లీటర్ నీటికి కలిపి మామిడి పిందకట్టే దశలో, కాయలు ఊరేదశలో ఒకసారి పైపాటుగా పిచికారి చేయాలని సూచించారు. డాక్టర్ జి.సందీప్‌నాయక్, శాస్త్రవేత్త (తెగుళ్ళ విభాగం)మాట్లాడుతూ మామిడిలో పూత మొదలయ్యే ముందు ఇమిడాక్లోప్రిడ్ 0.3ఎం ఎల్,వేప నూనె 1500 పీపీఎం 5 ఎం ఎల్ ,కాపర్ ఆక్సి క్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటి కలిపి పైపాటుగా పిచికారి చేయడం వలన పూత ప్రారంభ దశలో ఆశించి తేనె మంచు పురుగు, తామర పురుగు, ఆకుమచ్చ తెగులును సమర్థవంతంగా యాజమాన్యం చేయవచ్చని సూచిం చారు. మామిడి పంట ఆశించే పండు ఈగను సమర్థవంతంగా యాజ మాన్యం చేసుకోవడానికి పండు ఈగను ఆకర్షించే బెంగళూరు వారు రూపొందించిన పండు ఈగ బుట్టలను వినియోగించాలని సూచించారు. ఉద్యమ శాఖ అధికారి భాస్కర్ మాట్లాడుతూ ఉద్యానశాఖ తరపున అమలు చేయుచున్న పథకా లు, రాయితీల గురించి వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన సహా యకులు శ్రావణకీర్తి, దినేష్, రూపేష్‌నాయక్, హరిప్రసాద్ రైతులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత మనందరి బాధ్యత : ఎంపిడిఒ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

పరిసరాల శుభ్రత మనందరి బాధ్యతని ఎంపిడిఒ ఫక్రుద్దీన్, ఎంఇఒ పద్మావతి, ఎఒ రమేష్‌బాబు, డిప్యూటీ ఎంపిడిఒలు లక్ష్మీపతి, బాలరాజులు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రమైన నిమ్మనపల్లెలో స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో జడ్‌పి హైస్కూల్ (తెలుగు), ఉర్దూ పాఠశాల విద్యార్థులచే ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రజలంతా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కడపడితే అక్కడ చెత్తను వేయవద్దని, అంటు వ్యాధులు బారిన పడకుండా ఉండాలన్నారు. స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్రలో ప్రజలు భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ఎపిఒ రమేష్‌బాబు, ఉర్దూ ఉపాధ్యాయుడు నాదిర్షా వలి, ఉపాధ్యా యులు నీలవేణి, గోపాల్, నాదిర్షా గుల్జార్, శీన పాల్గొన్నారు. **సుండుపల్లి:** స్థానిక కస్తూర్బా గాంధీ పాఠశాలలో టిడిపి మండల అధ్యక్షులు చప్పిడి రమేష్‌నాయుడు విద్యార్థులతో కలిసి స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. పాఠశాల ఆవరణంలో పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.**కలికిరి:** సిఎం చంద్రబాబు ప్రవేశపెట్టిన స్వచ్ఛఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమానికి ప్రజలందరూ సహకరించాలని ఎంపిడిఒ భానుమూర్తి రావు పిలుపునిచ్చారు మండలములోని సచివాలయం-4లో సర్పంచ్ ఎల్లయ్య అధ్యక్షతన స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంపై గ్రామసభ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడివో



సుండుపల్లి : పాఠశాల ఆవరణాన్ని శుభ్రం చేస్తున్న రమేష్‌నాయుడు

మొహమ్మద్ రియాజ్ ఉద్దీన్, మండల స్వచ్ఛ భారత్ మిషన్ రిసోర్స్ కో-ఆర్డినేటర్ శంకర్, గ్రామ పంచాయతీ ఇఒ అశోక్, గ్రామ కమిటీ అధ్యక్షులు యోగేష్‌రెడ్డి, గ్రామ రెడ్డెప్ప రెడ్డి, సచివాలయం సిబ్బంది, వెలుగు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. **తంబళ్లపల్లి:** ఇంటిచుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని స్వచ్ఛాంధ్రప్రదేశ్ నిర్మాణంలో భాగ ములవుదామని డిఎల్‌డిఒ అమరనాథరెడ్డి అన్నారు. శనివారం ఎంపిడిఒ బాపూజీ పట్నాయక్, డ్వామా పీడీ వెంకటరత్నం, అధికారులు, వైద్యఆరోగ్య సిబ్బందితో కలసి స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర ఏర్పాటు చేశారు. ప్లకార్డులు చేతబట్టి పరిశుభ్రత, ప్రాధాన్యత, వ్యర్థాల నుంచి కంపోస్ట్ ఎరువుల తయారీపై అవగాహన ర్యాలీ చెపట్టారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-రాజంపేట

ప్రతికూల వాతావరణం దృష్ట్యా వ్యాపిస్తున్న సీజనల్ వ్యాధులను కట్టడి చేసేందుకు ముందుస్తు నివారణ చర్యలను చేపట్టాలని, వైద్యాధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం కూచివారిపల్లి సచివాలయం పరిధిలోని అగ్రహారం గ్రామంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ శేఖర్, అకేపాడు డాక్టర్ అశ్విని చంద్ర ఆధ్వర్యంలో జిల్లా మలేరియా అధికారి, ఎంటమాలజీ బృందం వెంకటేష్, రిమ్స్ ప్రొఫెసర్లు డాక్టర్ సునీల్, మైక్రో బయాలజీ విభాగం డాక్టర్ నవాజ్ షరీఫ్, ఎస్‌పిఎం డాక్టర్ హర్షిత పర్యటించి డెంగీ, చికన్ గున్యా, మలేరియా బోధకాలు, మెదడు వాపు జ్వరం, స్క్రబ్ టైఫస్, టైఫాయిడ్, అతిసార వ్యాధులు గురించి ప్రజలకు వివరించి పలు సూచనలు చేశారు. జ్వరాల బారిన పడిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. అనుమానితులకు వైద్య సిబ్బంది ద్వారా నమూనాలు సేకరించి పరీక్ష నిమిత్తం రిమ్స్‌కు పంపినట్లు తెలిపారు. వారానికి ఒక సారి ఇంటిలో నిలువ ఉన్న నీటిని శుద్ధి చేసుకోవాలని, ఇంటి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే-డ్రైడే కార్యక్రమం నిర్వహించి సీజనల్ వ్యాధులు గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఎఎన్ఎంలకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ నరేష్, మలేరియా సబ్‌యూనిట్ అధికారి ఎస్.ఎస్.దాస్, ఆరోగ్య విస్తరణ అధికారి శంకర్ రాజు, హెచ్ఎ.ఖాదర్ వల్లి, ఎంఎల్‌హెచ్‌పిలు, ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యురాలి హిజాబ్ తొలగించడం అమానుష చర్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



మాట్లాడుతున్న ముస్లిం ఐక్యవేదిక నాయకులు

మహిళా వైద్యురాలి హిజాబుని తొలగించడమంటే మహిళా వ్యక్తిగత స్వేచ్ఛపై దాడి చేయడమేనని ముస్లిం ఐక్య వేదిక కడప, అన్నమయ్య జిల్లాల అధ్యక్షులు డాక్టర్ ఎస్.కె. బాషా ఆరోపించారు. శనివారం స్థానిక ముస్లిం ఐక్య వేదిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీహార్ సిఎం నితీష్‌కుమార్ చర్యను తీవ్రంగా ఖండిం చారు. ఇది మహిళల గౌరవం, ఉనికికి ప్రమాదకరమన్నారు. దేశంలో ముస్లిం మహిళలతో పాటు హిందువులు, మహిళా యువతులు కూడా తమ మోహాన్ని దాచుకోవడానికి హిజాబ్ తోపాటు వివిధ పద్ధతులు పాటిస్తున్నారని గుర్తు చేశారు. మహిళా వైద్యురాలికి నియామక పత్రం అప్పగించే సమయంలో ఆమె ముఖం కనిపించే విధంగా ఉండాల్సి ఉంటే మహిళా సిబ్బంది ద్వారా హిజాబ్‌ను తియ్యమని చెప్పి ఉండాల్సిందే తప్ప సీనియర్ ముఖ్యమంత్రిగా నితీష్‌కుమార్ స్పందించిన విధానం ఆక్షేపనీయమన్నారు. ఇలాంటి పద్ధతిని మహిళా సమాజం సమర్థించదన్నారు. ఈ సమావేశంలో ముస్లిం ఐక్యవేదిక ప్రతినిధులు ఖాదర్ బాషా, చాంద్ బాషా, ముజీబ్ పాల్గొన్నారు.



టిఎల్‌ఎంను ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

టిఎల్‌ఎంతో విద్యా భోదన సులభతరం

ప్రజాశక్తి - నందలూరు

బోధనోపకరణాలను వినియోగించడం ద్వారా విద్యార్థులకు సులభంగా విద్యాబోధన చేయవచ్చని రాయచోటి డివిజన్ డిప్యూటీ డిఇఒ ఎల్.నాగయ్య పేర్కొన్నారు. మండలంలోని నాగిరెడ్డిపల్లి జడ్‌పి హైస్కూల్‌లో క్లస్టర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ అధ్యక్షతన శనివారం సాయంత్రం జరిగిన క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రతిఒక్కరూ పాటుపడాలని కోరారు. ఉపాధ్యాయులు తాము తయారుచేసిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను ప్రదర్శించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు కృపానందం, లీలా కృష్ణయ్య పాల్గొన్నారు.



మహిళకు బిపిని పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

రెండో రోజూ సఖి సురక్ష ఆరోగ్య పరీక్షలు

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్ : పట్టణంలోని మెప్మా కార్యాలయంలో రెండో రోజూ కూడా డ్వాక్రా మహిళలకు సఖీ సురక్ష ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. శనివారం డ్వాక్రా సంఘాలకు చెందిన 738మంది మహిళలకు ఉచితంగా 16 రకాల ఆరోగ్య పరీక్షాలను వైద్యులు నిర్వహించారు. జిల్లా ఐబి అధికారి టి.నాగరాజు మాట్లాడుతూ 30 సంవత్సరాల పైబడిన మహిళలకు వారికి తెలియకుండానే ఎన్నో జబ్బులు ఉండే అవకాశం ఉందన్నారు. ఈ విషయాన్ని గుర్తిం చిన ప్రభుత్వం గ్రామ మహిళలకు ఉచితంగా స వైద్య సేవలను అందించడం జరుగుతుందన్నారు. ఇవే పరీక్షలను వారు బయట చేయించు కోవాలంటే వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైద్యుడు సురేంద్ర, మెప్మా మేనేజర్ అబ్బాస్ అలీఖాన్, నాగమణి రమణమ్మ, ఎస్ఇ ఎఫ్ఆర్‌పిలు, ఆయుష్ సిబ్బందిలు పాల్గొన్నారు.

ప్రయివేట్ బస్సులపై కొరడా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : మదనపల్లెలో ఇష్టారాజ్యాంగా నడుస్తున్న ప్రయివేట్ బస్సులపై రవాణా శాఖ అధికారులు కొరడా ఝులిపించారు. శనివారం స్థానిక బెంగుళూరు రోడ్డులో మాటువేసిన ఆర్‌టిఒ అశోక్ ప్రతాప్‌రావ్, ఎంవిఐలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న మధుసూదన్, ఎస్ఎల్‌టి బస్సులకు రూ.20వేలు జరిమానా విధించారు. నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న మరిన్ని వాహనాలకు రూ.లక్షకు పైగా అపరాధాలు విధించారు. కార్యక్రమంలో ఎంవిఐలు దినేష్‌చంద్ర, శివలింగయ్య, శ్రీహరి పాల్గొన్నారు.

టూటౌన్ పోలీసుస్టేషన్‌లో డిఎస్‌పి తనిఖీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : పట్టణంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్‌ను శనివారం డిఎస్‌పి మహే ంద్ర ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి కేసుల దర్యాప్తును వేగవం తం చేయాలని ఆదేశించారు. రౌడీషీటర్లు, అనుమానితులపై నిరంతరం నిఘా పెట్టాలని సూచించారు. రాత్రుల్లో గస్తీని పెంచాలని, స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారుల పట్ల స్నేహ పూర్వకంగా మాట్లాడి, పోలీసు వ్యవస్థపై నమ్మకం కలిగిం చేలా ప్రవర్తించాలని సూచించారు.కార్యక్రమంలో సిఐ రాజారెడ్డి, ఎస్ఐ రహీ ముల్లా, రామాంజనేయులు, ఎఎస్ఐలు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కెరీర్ ఎక్స్‌పో వాయిదా

ప్రజాశక్తి-రాయచోటి : జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల ప్రిన్సిపల్స్, హెచ్ఎంలకు 20న జరగాల్సిన జిల్లా స్థాయి కెరీర్ ఎక్స్‌పో, ప్రదర్శనను ఈనెల 27కు వాయిదా వేసినట్లు జిల్లా ప్రాజెక్టు అధికారి డాక్టర్ ఎన్. అనురాధ శనివారం ఒక ప్రకటన లో పేర్కొన్నారు. జిల్లాలోని ప్రిన్సిపల్ ,హెడ్ మాస్టర్ ,హెడ్ టీచర్‌లకు వారి పాఠశాలల నుంచి ఆసక్తి గల విద్యార్థులను ప్రోత్సహించి జిల్లా స్థాయి కెరీర్ ఎక్స్‌పో, ప్రదర్శనను పాల్గొనేటట్టు చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యార్థి దశ నుంచే రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి-గాలివీడు

విద్యార్థులకు రాజ్యాంగంపైన చట్టాల పైన అవగాహన ఉండాలని భారత న్యాయవాదుల సంఘంకడప అన్నమయ్య జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఈశ్వర్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆనంద్ కుమార్ అన్నారు. రాజ్యాంగం - చట్టాలపై అవగాహన అనే చైతన్య సదస్సును భారత న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో గాలివీడు లోని రవిచంద్ర గౌతమ్ పాఠశాలల్లో శనివారం ఉదయం నిర్వహించారు. ఈ కార్యక్రమం పాఠశాల అధిపతులు థామస్ సింటో ల అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఐఎఎల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఈశ్వర్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆనందకుమార్ మాట్లాడుతూ రాజ్యాంగంలోని ప్రాథమిక అంశాలు అన్నీ కూడా పాఠ్యాంశాలలో చేర్చి చిన్న వయసు నుంచే విద్యార్థులకు అవగాహన పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. బలహీనుల హక్కుల పరిరక్షణ కోసంఅంబేద్కర్ రాసిన రాజ్యాంగం ఎంతగానో ఉపయోగ పడుం దన్నారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థులు తెలియకనే చట్టపరమైన సమస్యల్లో చిక్కుకునే అవకాశాలు ఉన్నాయని, అందుకే చట్టాలను గౌరవిస్తూ బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని న్యాయవాదులు సూచించారు. భారత రాజ్యాంగం అనేది దేశంలోని అన్ని కులాలకు మతాలకు పవిత్ర గ్రంథం లాంటిదని దీనిని కాపాడు కోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సీనియర్ న్యాయవాది ఈశ్వర్‌ను విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు చాలా చక్కగా సమాధానాలు ఇచ్చి, వారి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు చిన్నయ్య, హెూమి యోన్‌బాషా, లక్ష్మీదేవి , వరలక్ష్మి కుసుమ, కళాశాల ప్రిన్సిపల్, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఎస్‌కె బాష

క్రైం కార్నర్

స్కూటర్ ఢీకొని వృద్ధురాలికి గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్కూటర్ ఢీకొని వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటన శనివారం పుంగునూరు మండ లంలో జరిగింది. బాధితురాలి కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండలంలోని మేలిపట్లకు చెందిన మునెమ్మ తన ఇంటి ముందు నిలబడుకుని ఉండగా గుర్తు తెలియని స్కూటర్ వచ్చి ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ బాధితురాలని కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు.